

# లంకెబిందెలు

శ్రీ కప్పగంతుల
సత్యనారాయణ

ఒక్కరూపాయి పెట్టుబడిపెట్టి లక్షలు గడించాడు చలమయ్య. ఎలా వ్యాపారంచేశాడో, ఎలా సంపాదించాడో, చలమయ్యకే తెలియాలి; గదిలో భోషాణము పెట్టెలోదాగిన లక్ష్మికే తెలియాలి. "ఇంతఆస్తి వీడికెలా సంక్రమించిందిరా!" అని వూళ్ళోవారందరికీ సమస్య. "ఎంతకష్టపడితే యీమాత్రం నాలుగురువ్వలు సంపాదించాననుకుంటున్నారేమిటి?" అంటాడు చలమయ్య. చలమయ్య నాలుగురువ్వలూ, వూళ్ళో ప్రజలకి నాలుగు జోడాల లక్షలు.

దానధర్మాలకీ, చలమయ్యకీ ఉత్తర దక్షిణ ధ్రువాలకీ వున్నంతస్నేహం. "చెమటూడ్చి, నిద్రాహారాలు లేకుండా నేను సంపాదించటము, వీళ్ళకీ వాళ్ళకీ పంచిపెట్టడానికీ, పారెయ్యటానికీ కాదు" అనేవాడు, ఎవరైనా ఏ చందాకైనా పట్టీ తీసుకొని వెళ్ళితే. ప్రతి వేలం పాటకీ, అతను తప్పకుండా హాజరు చెపుతాడు. కానీ లాభంకనుపించేదయినా తనపేర కొట్టివేయిస్తాడు ఏవస్తువైనా.

"ఇంట్లో సెట్టిగారున్నారా?" అని వొకరోజున వొకవ్యక్తి చలమయ్య యింటిదగ్గర అడిగాడు. అతుకులు వేసిన కోటు, అక్కడక్కడ చిరిగిన పంచా, దుమ్ముతో నిండిన తలా చూస్తేనే అతనిభాగ్యమంతా బయలుపడుతోంది.

"లోనికిరాండి" అని లోపలినుంచి పిలుపు.

లోపలికివెళ్ళాడు క్రొత్తమనిషి. అరుగుమీద చాపవేసుకొని, ముందు డస్కుపెట్టుకొని మేరుపర్వతంలా కూర్చున్నాడు చలమయ్య.

"కూకోండి" అని ఆహ్వానించాడు క్రొత్తమనిషిని.

"నాపేరు కోటీశ్వరరావు" అని ఆరంభించాడు క్రొత్తమనిషి.

'ఒకప్పుడు చాలాగౌరవంగా బ్రతికినవాడిని. ఇప్పుడు కొన్నికారణాలవల్ల చాలా చిక్కులలోవున్నాను. మీరేమయినా సహాయంచేస్తే, త్వరలో—'

"ఏదండీ, అయ్యా--లాభాలు పడిపోయి, నష్టాలు లెక్కచూసుగోడంతోటే సరిపోతూంది మాపనీ. గ్రామమంతా, శెలమయ్యకాడ యేదో వుందనుకుంటున్నారు గామాలె. అయ్యతోడు, నాకాడ యేమైనావుంటే తమరికి సాయంచెయ్యకపోదునా !" అని కోటీశ్వరరావు చెప్పబోయిన కధకి బ్రేకువేశాడు చలమయ్య.

"చాలాయిబ్బందిలోవున్నాను. లక్ష్మీపుత్రులు తమబోటివారు సహాయంచెయ్యకపోతే—"

"అదుగదీ—ఏంమాటలుసెపుతారండీ. నాకాడ మాత్రం డబ్బు కూకుందా. నాకేమయినా లంకెబిందెలు దొరికాయా; నేనూ యేపూటకాపూట సంపాదించుకొనే వోణ్ణే."

చలమయ్య లంకెబిందెలుఅనేసరికి యేదోతళుక్కుమని మెరిసింది కోటీశ్వరావుకళ్ళలో. కొంచెంసేపు ప్రాధేయపడి లేదనిపించుకొని, వెళ్ళిపోయాడతను కాని, వచ్చేటప్పుడున్నదిగులుకు బదులు వెళ్ళేటప్పుడు ఏదో ఆలోచన ఆవరించింది అతనిమనస్సును.

౨

పరిస్థితులుమారి లక్షరూపాయల ఆస్తిపోయి, బిచ్చమెత్తే స్థితిలోకివచ్చినా, అఖండమైన తెలివితేటలూ, అమోఘమైన ఆలోచనామాత్రం కోటీశ్వరరావును విడిచిపెట్టలా. ఇప్పుడతనికి ఉన్నదల్లా ఒక్కపెంకుటిల్లు. అది కూడా యేతాతలనాటిదో, అవడంచేత కొంచెంకొంచమే నేలకి అంటుతోంది. పడిపోకుండా అన్నివిధాలాబాగున్న ఒక పడమటిగది అతనికి ఆఫీసూ, పడకగదీ, అన్నీని. 'నా' అని చెప్పుకోవలసినవాళ్ళంతా ఇహలోకంనుంచి సెలవు పుచ్చుకోవడంచేత 'ఉడిపిహోటలు' యజమానే అతనికి తల్లీ, తండ్రీ, అన్నా, చెల్లెలూ అన్నీని. చాల గంభీరమైన ఆలోచనతోటి యింటికివచ్చి, తాతలనాటి 'సందువా'పెట్టి వొకటివుంటే దానిని బైటికితీశాడు. నల్లబడిపోయిన యిత్తడిబాదులు కొంచెం 'బ్రాసో'పెట్టి తెల్లపరిచాడు. తనపూర్వీకులు యెవరో వ్రాసుకున్న తాటాకుల పద్యగ్రంథం వొకటివుంటే తీసుకొచ్చి, దానిమొదటి పేజీలోనే త్రుప్పుపట్టిన గంటంతో యేమో వ్రాసి ఆపుస్తకాన్ని సందుగు పెట్టెలోపెట్టి, ఆపెట్టెతీసికొని మళ్ళీ చలమయ్యదగ్గిరకి వెళ్ళాడు

'ఇందాకనే, చెప్పానుకదూ, లాభంలేదని!' అన్నాడు చలమయ్య.

'నేను బదులుకోసం రాలేదు. నాఆస్తిఅంతకీ, యీసందువాపెట్టె ఒకటిమిగిలింది. బజారులోవెళ్ళి, అమ్ముకోడానికి నాపూర్వపుపరువు యేడిపిస్తోంది. యేదోధరచేసి తమరే యిప్పిస్తే—'

'యిదెవరుకొంటారూ, అయినా, రెండణాలు యిస్తాను యియ్యండి.'

'ఇందులో, తాటాకుగ్రంధం ఒకటివుంది. అది అచ్చువేయించుకున్నా మీకులాభమే. అధమం వొక రూపాయి అయినా—'

'నాచేతకాదు, పావలా యిస్తాను, యియ్యండి. లేకుంటే వెళ్ళండి.'

కాస్సేపుసణిగి, పావలాతీసికొని ఆపెట్టెయిచ్చివెళ్ళిపోయాడు కోటీశ్వరరావు.

పెట్టె కొంచెం బాగుచేయించి, వేలంవేయిస్తే రూపాయో రూపాయిన్నరో వస్తుందని బుజాలెగరేశాడు చలమయ్య.

* * *

'ఒరే, రాముడూ, నేనొకనాటకమాడుతున్నాను. అందులో నువ్వుకూడా వొకపాత్రవేశావంటే నీకు నూటపదార్లు యిస్తాను.'

'ఏడిసావు కూటికి లేదు. నాకు నూటపదార్లు యిస్తావుట్రా హహ్హాహా'

'ముందుకాగితము రాయించి పుచ్చుకో, ఇవ్వకపోతే అను నువ్వు తెలివిగానీపాత్ర నిర్వహించాలిగాని—'

'ఆసంగతి నువ్వునాకు చెప్పేదేమిటి చండప్రచండుడిలా ఆడ్తాడు.'

'అయితే వినుమరి' —

3

'చలమయ్య శెట్టిగారున్నారా ?

'లోపలికి రాండి.'

లోపలికి వెళ్లాడు రామారావు. కూచోమన్నాడు చలమయ్య.

'నాపేరు రామారావు.'

'సిత్తం'

'మీతోవొక వ్యాపారాన్నిగురించి సంప్రతించటానికి వచ్చా.'

'చెప్పండి.'

'ఈవూళ్లో కోటీశ్వరరావు అని వొకాయన వున్నారు. ఆయన మీకు తెలుసును కూడాను. యీ మధ్య ఆయనమీకొక సందువాపెట్టె అమ్మినట్లు తెలిసింది'

'అవును పావలా శుష్కదండుగ పెట్టాను.'

'కావచ్చును. ఆపెట్టెవిషయమై మాట్లాడటానికి వచ్చాను.

'... ... ... ... ... ... ...'

'ఆపెట్టెలో వొక తాటాకు గ్రంథముంది.'

'ఆతాటాకుల్ని, గ్రంథాలని సదువుకునోన్డెవడూ అనడు.'

'ఆతాటాకులకు మీరడిగిన ధర యివ్వటానికి నేను సిద్ధంగావున్నాను. నాకు వాటితోపనుంది.'

చలమయ్య కూర్చున్న చోటినుంచి కొంచెంసర్దుకున్నాడు. అతనికళ్లుకొంచెం విప్పారాయి. రామారావు చాలా గంభీరంగా, కార్యదీక్షతో Business like గా కూచున్నాడు.

'చలిమంటకి కూడా పనికిరావు ఆతాటాకులు' అన్నాడు చలమయ్య.

'కావచ్చును మీరిచ్చినడబ్బు మీకునేనుయిస్తాను. ఆపెట్టె మీరువుంచుకొని, తాటాకులు నాకిచ్చెయ్యండి.' రామారావు అడిగాడు.

'ఒకసారి కొన్నవస్తువును మళ్లా అమ్మటం నాకు మామూల్లేదండి.'

'ఆలోచించుకోండి మీకు లాభం కావల్నన్నా యిస్తాను. ఆతాటాకులే నాకు కావలసినవి. ఆవస్తువు మీసొంతమయినట్టుగానే బేరంచెప్పండి.'

'నేనమ్మ దలచుకోలేదండి.'

'ఐదు రూపాయలు'

'ఊహుఁ.'

'పది'

'రేపురండి, ఆలోచించి చెపుతాను.'

'చిత్తం మీయిష్టం ఆలోచించుకోండి. ఆపద్యాలు మీకర్థముగావు. ఇంకో పదిరూపాయలు ఎక్కువైనా నేను యిస్తాను. అచ్చు వేయించుకునేవాడిని బేరం సాయిలాపాయిలాగాకావడం నాకు ప్రధానం. వాడుఅమ్మువాడని తెలిస్తే వాడిదగ్గిరేకొందును. నాకు తెలియకుండా అమ్మేశాడు.'

'రేపురండి.'

రామారావును అవతలికి పంపించి, యింట్లోకివెళ్ళి ఆపెట్టె తీసుకొనివచ్చి ఆపద్యగ్రంథమేమిటో చూద్దామని తీశాడు. మొదటిపేజీ చదువుతూవుంటేనే అతనివొళ్లు జలదరించింది. అరచేతులు చెమటతో నిండాయి. జాగ్రత్తగా పెట్టెలోపెట్టి, ఆకాగితాన్ని తీసికెళ్లి,భోషాణంలో పెట్టి తాళం వేశాడు. మరునాడువచ్చిన రామారావుకి తను ఆతాటాకుల్ని అమ్మదలచుకోలేదని నిష్కర్షగా చెప్పాడు. తలకాయవంచుకొని రామారావు వెళ్లిపోయాడు 'ఆలోచించుకోండి' అంటూ. 'ఆలోచించుకొని చెప్పినమాటే యిది' అని తనలోతనే పొంగిపోయాడు చలమయ్య.

౪

నలిగిపోయిన సిగరెట్టు కాలుస్తూ చిరిగిపోయిన పరుపుమీద పడుకొని ఆలోచిస్తున్నాడు కోటీశ్వరరావు పడితూన్నయింట్లో. 'కోటీశ్వరరావుగారూ' అని కేక వినపడింది. వాకిట్లోకివచ్చి వూగులాడుతూవున్న తలుపు తెరిచాడు. చిన్నయేనుగులాగ చలమయ్య సాక్షాత్కరించాడు.

'లోనికి రావచ్చునా' అన్నాడు చలమయ్య కోటీశ్వరరావు మాట్లాడకముందే.

'అభ్యంతరమేమిటి రండి ఏదో విశేషముంది లేకపోతే మీబోటివారు—'

'విశేషానికే ముందండీ. యేదేనా యిల్లుకొనాలని ఆలోచన పెట్టుకున్నాను. తమరిమాట జ్ఞాపకమువచ్చి అడుగుదామనివచ్చాను. పదెక్కువైనా తమబోటివారు తింటే మాకంత బెంగలేదుకదండీ.'

'నేనమ్మదలచుకోలేదండి యీయిల్లు. యెవరు చెప్పారోకాని మీకు; నాకువున్న ఆస్తియిదే. యీయిల్లు కాస్తా అమ్మితే నేను చెట్టుమీది పక్షికన్న ఆస్కారము లేనివాణ్ణయి పోతాను.'

'బేరంలేను, సారంలేదు ఏంటి పంతులుగారూ, ముందే ఆమాటచెప్పుతారూ, ఏదోయిధంగా యవారం పైసలు చేసుకోవాలిగాని.'

'అబ్బే! పదివేలయినా నేనమ్మనండి యీయిల్లు.'

'పదివేలు నచ్చినోడు యియ్యాల్సిందే. ఏదో యేడెనిమిదొందలు ముట్టజెపుతాను కానియ్యండి.'

'లాభంలేదండి ఆహారంలోనూ, వ్యవహారంలోనూ మొహమాటం పెట్టుకునే మనిషినికాదండి నేను.'

ఇలాఆరంభమయిన బేరంచివరకి పదిహేనువేల దాకావచ్చింది. ఆలస్యమైతే కోటీశ్వరరావు అభిప్రాయం మార్చుకుంటాడేమోనని, అప్పుడప్పుడు డబ్బుయిచ్చి యిల్లు రిజిష్టరు చేయించుకున్నాడు చలమయ్య. ఇంట్లో సామానంతా పదిరూపాయలుకూడా చెయ్యదు కనుక ఆసామాను వదలిపెట్టేశాడు కోటీశ్వరరావు. నూటపదార్లు అనుకున్న ప్రకారం, రామారావుకిచ్చి, మెల్లిగా బొంబాయికి ప్రయాణంకట్టాడు, ఆవూళ్లో తనకి యెవరూదిక్కు లేరు కనుక.

ఆనాటిరాత్రే, లాంతరూ గునపమూపట్టుకొని, చలమయ్యా, అతనిభార్య చుక్కమ్మా క్రొత్తగాకొన్న యింట్లోకి, అర్ధరాత్రివెళ్లారు. చప్పుడుకాకుండా పెరట్లోకి వెళ్లారు. లాంతరు వెలుగున తాటాకువొకటి చదివాడు, చలమయ్య.

'పెరట్లో చింతచెట్టుక్రింద, రెండుబిందెలతోవర హాలూ, మొహరీలు మొత్తం లక్షాయిరవై వేలకిమ్మత్తు, పిండారీదండులు వస్తున్నారనే భయంతో పూడ్చడమైనది. ఇది చదవడం సంభవించిన మావంశీయులు, అవి తీసుకోగలరు.' రాక్షసనం॥ మాఘ బ॥ చతుర్దశి.

తనూ లాంతరు పట్టుకొని, భార్యను త్రవ్వమన్నాడు. చెట్టుక్రింద ఎక్కువ కష్టపడకుండానే మట్టి త్రవ్వడుపడింది. అరగజం త్రవ్వేటప్పటికి, గునపానికి 'ఖంగు'మని తగిలింది. జాగ్రత్తగా త్రవ్వి రెండు యినపబిందెలు—పాతవి—గొలుసుతో లంకెవేసినవి పైకితీశారు ఆయాసపడుతూ ఆయిద్దరు దంపతులూను.

ఏముందిలోపల—ఒకదాంట్లో బొగ్గులూ, ఒకదాంట్లో బూడిదానూ.

తలగోక్కుంటూ పైకిచూశాడు చలమయ్య. పైన చుక్కలుపక్కున నవ్వాయి—.